ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 ఆదివారం
12 జనవరి 2025

# బెజ్జంకిలో మాదిగల చైతన్య ర్యాలీ

**ప్రజానావ, బెజ్జంకి:** ఎస్సీ వర్గీకరణ అమలులో భాగంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న 'వేయి గొంతులు – లక్ష డప్పులు' మహా ర్యాలీ ప్రచారంలో భాగంగా శనివారం బెజ్జంకి మండలంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లూరి పరుశరాములు ఆధ్వర్యంలో డప్పుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కళాకారుల కోఆర్డినేటర్, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి డప్పోళ్ల రమేశ్ సారథ్యంలో భాగంగా మాదిగల చరిత్రను ఔనత్యాన్ని చాటుతూహాఆట పాటలతోహా మాదిగలను చైతన్య పరుస్తూహాకళాప్రదర్శనలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మాదిగ అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగాల లక్ష్మణ్, ఇన్‌చార్జీలు చింతకింది పర్శరాములు, జనగం శంకర్, గూడెం మాజీ సర్పంచ్ మంకాల బాలయ్య, తాడిచెట్టు భూమయ్యతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, గ్రామ శాఖల అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





# శనీశ్వరునికి భక్తిశ్రద్ధలతో తైలాభిషేకం

**ప్రజానావ, వేములవాడ:**

శని త్రయోదశి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి అనుబంధ దేవాలయం శ్రీ భీమేశ్వర ఆలయంలో నవగ్రహాలకు భక్తులు శనివారం తైలాభిషేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. శనీశ్వరునికి శని త్రయోదశి నేపథ్యంలో పూజలు చేయడం తైలాభిషేకం చేయడం ద్వారా పుణ్య ఫలాలు చేకూరుతాయని అర్చకులు పేర్కొన్నారు.

# సర్పంచ్ బరిలో యువత ఆసక్తి

- పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో కొనసాగుతున్న చర్చ
- ఎన్నికల బరిలో దిగేందుకు యువత ముందడుగు
- బీజేపీ నుంచి బరిలో ఆ ముగ్గురు

**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):**

'స్థానిక' పోరుపై యువత గురి పెట్టింది. 'పంచాయతీ' బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్నది. పోటీ కోసం యువ నాయకత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఒకవైపు, ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి యువ నాయకులు చొరవ చూపుతున్నారు. మరోవైపు, గ్రామంలోని ముఖ్య నాయకులను కలుస్తూ వారి ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చదువుకున్న యువతలు సర్పంచ్ బరిలో దిగాలని, గ్రామ సమస్యలు అర్థం చేసుకునే నాయకుడిని, ఆ సమస్యలను పరిష్కరించే వారినే గెలిపించుకుంటామని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## పోటీకి యువత సై

రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి చూపని యువత ధోరణిలో ప్రస్తుతం మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. రాజకీయాల్లోకి రావడానికి మక్కువ చూపుతున్నది. అందుకు పంచాయతీ ఎన్నికలను అవకాశంగా మలుచుకోవాలని ఎంతో మంది యువకులు పోటీకి సై అంటూ భావిస్తున్నారు. అటు రాజకీయ హోదాను అనుభవించేందుకు, అదే సమయంలో ఇటు ప్రజాసేవ చేయొచ్చన్న ఆలోచనతో చాలా మంది యువ నేతలు పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఊరిలో అధికారం చెలాయించవచ్చనే భావనతో ఎంతో మంది సర్పంచ్ పీఠంపై కన్నేశారు. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులదే హవా స్పష్టంగా కనిపించే అవకాశముంది. మరోవైపు సర్పంచ్ పోటీకి ఆసక్తి చూపుతున్న యువకులు ఇప్పటికే కదనరంగంలోకి దూకేశారు. ప్రజల్లో గుర్తింపు పొందేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఎక్కడా తమ పోటీ మాట బయట పెట్టడం లేదు. రిజర్వేషన్ కలిసొస్తే అప్పుడు నేరుగా రంగంలోకి దిగాలని భావిస్తున్నారు.

## ఎవరికి సీటొచ్చినా..


యువతలో నరేంద్ర మోడీ అంటే ఒక బ్రాండ్ గా నిలిచిపోయారు. ప్రపంచ దేశాలు సలాం కొట్టిన మోడీపై రోజురోజుకి యువకుల్లో మక్కువ పెరిగిపోతోంది. అలాంటి మక్కువ గల బీజేపీలో ఉన్న ఆ ముగ్గురు వెంకటాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పోటీలో దిగనున్నారు. బీజేపీ పార్టీ అంటే గౌరవం, పార్టీ సిద్ధాంతాలంటే మక్కువ ఉన్న ఆ ముగ్గురు పోటీకి సిద్ధమవుతున్నారు. ఆ ముగ్గురిలో సీటు ఎవరికి వచ్చిన మరో ఇద్దరు కలిసి పార్టీని గెలిపించుకోవడమే వారి ధ్యేయం. ఆ ముగ్గురు పార్టీకి ఎంతో న్యాయం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని పార్టీని బలోపేతం చేశారు. ఆ ముగ్గురిలో ఎవరికి అవకాశం ఇవ్వనున్నారో కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# విధేయుడికే మళ్లీ పట్టం

- బీజేపీ మండలాధ్యక్షుడిగా కొలిపాక రాజు రెండోసారి ఎన్నిక
- ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడి



ప్రజానావ, బెజ్జంకి: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా శనివారం అన్ని మండలాల అధ్యక్షులకు సంబంధించిన ప్రకటన వెలువరించింది. అందులో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా బీజేపీ కమిటీ ఎన్నికల అధికారి సంకినేని వెంకటేశ్వర రావు బెజ్జంకి బీజేపీ మండల అధ్యక్షుడిగా దాచారం గ్రామానికి చెందిన కొలిపాక రాజును నియమించారు. 2012లో పార్టీ సభ్యత్వం తీసుకున్న కొలిపాక రాజు మండల ఉపాధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, మండల సభ్యత్వ కన్వీనర్‌గా, 2019లో దాచారం ఎంపీటీసీగా, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పార్టీలో వివిధ పదవుల్లో సేవలందించాడు. 2024 న మండల అధ్యక్షుడిగా ఏడాది పూర్తిచేసి, తిరిగి రెండోసారి మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి కృషారెడ్డి, గంగాడి మోహన్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డితో పాటు తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో కృషి చేస్తానని, రానున్న సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.



## రామప్పను సందర్శించిన విదేశీయులు

**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):**

మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శనివారం స్విట్జర్లాండ్ దేశానికి చెందిన టీనా సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. అనంతరం టూరిజం గైడ్ విజయ్ ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత, కట్టడం, శిల్పకళా నైపుణ్యం గురించి వివరించారు. రామప్ప కట్టడం చాలా అద్భుతంగా ఉందని వారు ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును తిలకించి బోటింగ్ చేశారు.

# గర్రెపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి




**ప్రజానావ, సైదాపూర్:**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామ పరిధిలోని గర్రెపల్లికు బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సు సౌకర్యం లేకపోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ యువకుడు దోకిడి తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు గర్రెపల్లెలోనే రేషన్ బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గ్రామ యువకులు కోరారు. గర్రెపల్లిలో శనివారం తిరుపతి విలేకరులతో మాట్లాడుతూ గతంలో గర్రెపల్లెకు సరైన రోడ్డు నిర్మాణం లేక బస్సు సౌకర్యం కల్పించలేదని, ఇప్పుడు తమ గ్రామానికి రోడ్డు నిర్మాణంతో పాటు, బ్రిడ్జి నిర్మాణం కూడా జరిగిందన్నారు. గర్రెపల్లిని నూతన గ్రామ పంచాయతీగా ప్రకటించడం సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ బియ్యం కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకోవాల్సి వస్తుందని, సోమారం పరిధిలోని నాలుగు పల్లెలకు ఒక్కరే రేషన్ డీలర్ ఉండడంతో అంత దూరం వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందన్నారు. తమ పల్లెలోనే రేషన్ ఇస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. చివరికి పోస్ట్ మెన్ తెచ్చే ఉత్తరాలు సైతం ఆలస్యంగా అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కౌడిగాని రాజేశ్వరరావు, కౌడగాని కిషన్ రావు, తిపిశెట్టి మహేశ్, జాల రమేశ్, దోకిడి నరేశ్, తదితరులున్నారు.

# కొత్త పంచాయతీలకు సొంత భవనాలు



- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**ప్రజానావ, శంకరపట్నం:**

నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మిస్తున్నామని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం శంకరపట్నం మండలం గొల్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 20 లక్షల రూపాయలతో నిర్మించతల పెట్టిన పంచాయతీ భవనం పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకు అనుగుణంగా మానకొండూర్ నియోజకవర్గంలోని కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయాలకు కొత్త భవనాల నిర్మాణాలకు పూనుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో జీ. కృష్ణప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ రవి ప్రసాద్, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగాని బస్వయ్యగౌడ్, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, గొల్లపల్లి మాజీ సర్పంచ్ రజిత–తిరుపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్,పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మచ్చయ్య, కేశవపట్నం గ్రామశాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి నేతన్నల క్షీరాభిషేకం



**ప్రజానావ, గన్నేరువరం:**

చేనేత, మరమగ్గాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నేతన్న పొదుపు, నేతన్న భద్రత, భరోసా, అభయ హస్తం పథకాలను అమలు చేస్తూ జీవో జారీ చేయడాన్ని హర్షిస్తూ శనివారం మండల కేంద్రంలోని పద్మశాలీలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ అధ్యక్షుడు తెల్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు బూర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వడ్నాల అంజయ్య, వడ్నాల బల రాం, బూర లక్ష్మణ్, తెల్ల రాజయ్య, అకెన కనకయ్య, వేముల కృష్ణారి, వెంగళ కమల మనోహర్, గాలి శేఖర్, సబ్బని మహేశ్, తెల్ల బాలయ్య, వేముల రవి కుమార్, చిప్ప హరీశ్, బూర మల్లయ్య, తెల్ల రాజవీరు, ఆకన శ్రీనివాస్, తేల్ల మహేందం పాల్గొన్నారు.



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ గోపురాలు, కమాన్లను ఫైర్ సేఫ్టీ సిబ్బంది శనివారం ఫైర్ ఇంజన్ సహాయంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీ సిబ్బంది మాట్లాడుతూ రానున్న మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయ గోపురాలను ఫైర్ ఇంజన్ సహాయంతో శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది వేములవాడ రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే.

- ప్రజానావ, వేములవాడ

# ఘనంగా సెయింట్ విన్సెంట్ పల్లోటి పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు



ప్రజానావ బెజ్జంకి: బెజ్జంకి మండలం రేగులపల్లి గ్రామంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి పాఠశాల సిల్వర్ జూబ్లీ 25 ఏళ్ల వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా వ్యవస్థాపకుల్లో ఒకరైన తుమ్మ బాల మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం చేసినప్పుడు ఐదుగురు విద్యార్థులతో ప్రారంబమై నేడు 1245 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు తమపై ఎనలేని నమ్మకాన్ని ఉంచి వెన్నంటి నడచిన తల్లిదండ్రులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులతో పాటు తమతో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాప్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మాలతి, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఫ్యూల జ్ఞానప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిట్టిబాబుపై కేసు నమోదు చేయాలి

**ప్రజానావ, వేములవాడ:** రజక సామాజిక వర్గాల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన సినీ రచయిత చిట్టిబాబుపై వెంటనే కేసు నమోదు చేయాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య మడేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి సతీష్, వేములవాడ రజక సంఘం మండల నాయకుడు మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, నేరెళ్ల నర్సయ్య, మండల నరేశ్, నేరెళ్ల శ్రీనివాస్, మొగిలి చంద్రశేఖర్ శనివారం ఏఎస్పీని కలిసి ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సగర్వంగా జీవిస్తున్న రజ కులను కించపరిచేలా మాట్లాడిన చిట్టిబాబును వెంట నే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రజక జాతికి చిట్టిబాబు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ నాయకులు కాసర్ల శ్రీనివాస్, మొగిలి రమేశ్, గ్రామ శాఖ నాయకులు రేవంత్, కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

